క్లుప్తంగా

రాజ్యాంగ స్ఫూర్తి అవసరం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థి దశ నుంచి రాజ్యాంగ స్ఫూర్తి పెంపొందించడానికి తొలిసారిగా భారత రాజ్యాంగంపై ఒలింపియాడ్ పరీక్ష నిర్వహించామని ఎంఎస్ఎన్ విద్యా సంస్థల డైరెక్టర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ అన్నారు. స్థానిక అశోక్‌నగర్ ఎంఎస్ఎన్ పాఠశాలలో ఆదివారం భారత రాజ్యాంగంపై ఒలింపియాడ్ పరీక్ష రెండు కేటగిరీలుగా నిర్వహించారు. 13 నుంచి 15 ఏళ్లు ఒక కేటగిరీ, 15 నుంచి 18 ఏళ్లు మరో కేటగిరీగా విభజించి నిర్వహించగా 147 మంది పరీక్ష రాశారు. ఇలాంటి ఒలింపియాడ్ నిర్వహించడం ఇదే తొలిసారని, నూతన ఒరవడికి నాంది పలికామన్నారు. పరీక్షకు ఏవిధమైన రుసుం చెల్లించాల్సిన అవసరం లేకుండా, ఉచితంగా మెటీరియల్ అందజేశామన్నారు. అనంతరం పరీక్ష రాసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ నాగిని, కరస్పాండెంట్ లక్ష్మీతులసి ఇచ్చారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.22.60 లక్షలు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో మాఘ మాసంలో ఈ నెల 1 నుంచి 23వ తేదీ వరకూ హుండీలు, ఆన్‌లైన్ పేమెంట్ల ద్వారా రూ.22,60,928 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. దర్శనాల ద్వారా రూ.8,17,220, సేవల ద్వారా రూ. 2,78,498, ప్రసాదం విక్రయాలతో రూ.1,77,025, అన్నదానం విరాళాలుగా రూ.8,56,612, ఆలయ అభివృద్ధికి రూ.21,573, ఆన్‌లైన్ క్యూఆర్ కోడ్ ద్వారా రూ.1,10,000 వచ్చిందన్నారు. గత ఏడాది మాఘమాసం నాలుగు ఆదివారాల ఆదాయం మొత్తం రూ 2,55,392లు కాగా, ఈ ఏడాది రూ.4,55,668 ఆదాయం వచ్చిందన్నారు. ఆదివారం ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసి సుమారు నాలుగు ఆదివారాలు సుమారు లక్ష మందికి అన్నప్రసాద వితరణ జరిపారు.

హాస్టల్ వార్డెన్ బలవన్మరణం

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట గ్రామంలో నివసిస్తున్న బీసీ హాస్టల్ వార్డెన్ అరిగెల పాండురంగ(52) ఆదివారం తన నివాసంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. సర్పవరం పోలీసుల వివరాల మేరకు, రాజోలు బీసీ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న పాండురంగ సుమారు నాలుగు నెలల క్రితం సస్పెన్షన్‌కు గురయ్యారు. మద్యానికి బానిసైన అతను తీవ్ర మనస్తాపంతో పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడినట్టు పోలీసులు చెప్పారు. ప్రభుత్వాస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

కాకినాడ అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నంబర్లు	
డివిజనల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ	9290145126
డివిజన్ ఇన్‌స్పెక్టర్	
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577

కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు

ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓపీఆర్డీ	9849352293
మండల ఇంజినీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ–1	8008293994
ఎంఈఓ–2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధి పథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఎం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ	9603007219
ఇరిగేషన్ ఏఈఈ	9704651826
డ్రెయినేజీశాఖ ఏఈఈ	9963744219
ఆర్‌అండ్‌బీ ఏఈఈ	9440818530
కరప పీహెచ్‌సీ డాక్టర్	8096940176
వేళంగి పీహెచ్‌సీ డాక్టర్	9962553545
పశుసంవర్ధక శాఖ ఏడీఏ	9490047668
నడకుదురు వెటర్నరీ డాక్టర్	9652547579
వేళంగి వెటర్నరీ డాక్టర్	8332973558
అరట్లకట్ట వెటర్నరీ డాక్టర్	9494671642
ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్	9704512131
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	9492600813
కరప ఎస్ఐ	9440796557
తాళ్లరేవు ఎక్సైజ్ సీఐ	9440902407

పెంట కాలువలు

- కాలువల్లో పెరిగిన గుర్రపుడెక్క
- అన్నదాతలకు తప్పని కష్టాలు



పాతర్లగడ్డ సమీపంలో కేఎంజే పంట కాలువలో గుర్రపుడెక్క, తూటుకాడ



జెడ్.భావారం డ్రెయిన్‌లో ఇలా..



కరప వద్ద శహపురం డ్రెయిన్‌లో పెరిగిన గుర్రపుడెక్క

కరప: మురుగు, సాగునీరు వెళ్లేందుకు నిర్మించేవే కాలువలు.. అలాంటి కాలువలపై నిర్లక్ష్యం అలముకుంది.. ఈ కాలువవల్లో ఎక్కడికక్కడే గుర్రపుడెక్క పెరిగిపోవడంతో సాగునీటికి కష్టాలు ఎదురవుతున్నాయి. ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నామని ముందు, ముందు సాగునీటి ఎద్దడి ఎలా ఉంటుందోనని రైతన్నలు దిగులు చెందుతున్నారు. అలాగే మురుగు కాలువలపై నిర్లక్ష్యం ఏంటని పాలకుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి పంట కాలువలు ఎంత ముఖ్యమో, మురుగు కాలువలు కూడా అంతే ముఖ్యమని అటువంటి వాటిని నిర్లక్ష్యం చేయడం తగదని అంటున్నారు. నీటి సంఘాలు కానీ, ఇరిగేషన్, డ్రైనేజీ శాఖాధికారులు కానీ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కరప మండలంలోని భూములన్నీ కాలువ శివారున, సముద్ర తీరాన ఉన్నాయి. మండల పరిధిలో సుమారు 14 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కాలువల్లో పూర్తిస్థాయిలో గోదావరి నీటి ప్రవాహం లేక వంతుల వారీ విధానం అమలు చేస్తున్నారు. అవసరమైతే మురుగు కాలువల్లో అడ్డుకట్టలు వేయించి, రైతులు తోడుకునేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నా, పూర్తి స్థాయిలో పనులు చేయించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఒకపక్క పంట కాలువల్లో కూడా తూటుకాడ, గుర్రపుడెక్క పెరిగిపోయి, నీటి ప్రవాహానికి ప్రతిబంధకంగా మారింది. ప్రధానంగా కేఎంజే పంట కాలువ ద్వారా అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, గురజనాపల్లి తదితర గ్రామాల్లోని సుమారుగా 5 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. ఈ కాలువ పరిధిలో గుర్రపుడెక్క, తూటు అడవిలా పెరిగిపోయింది. అలాగే మురుగు కాలువలు అధ్వానంగా తయారైనా పట్టించుకునే నాథుడే కరవయ్యారని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా తుల్యభాగ, జి.భావారం, యండమూరు, శహపురం, కూరాడ, జెడ్.భావారం, పాతర్లగడ్డ డ్రెయిన్లు, వెంకటప్పయ్య, రాజు డ్రెయిన్లు ఉన్నాయి. ఈ డ్రెయిన్లు అన్నీ గొర్రిపూడి వద్ద తుల్యభాగ డ్రెయిన్‌లో కలుస్తాయి. అక్కడి నుంచి పటవల వద్ద సముద్రంలో వెళ్తాయి. డ్రెయిన్లు అన్నింటిలో కూడా గుర్రపుడెక్క అడవిలా పెరిగిపోయి, నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. దాళ్వాలో వంతుల వారీ విధానం అమలు చేయడంతో రైతులు తమకు వచ్చిన వంతులో సాగునీటిని పెట్టుకుంటున్నారు. తర్వాత వంతు వచ్చేలోపు పంట పొలాలు ఆరిపోతున్నాయి. దుబ్బుకట్టే దశలో వరిచేలు ఉన్నాయి. ఈ దశలో సాగునీరు ఎంతో అవసరం. వంతువచ్చేలోగా డ్రెయిన్ల నుంచి ఆయిల్ ఇంజిన్, గుల్లలతో తోడుకుందామనుకునే రైతులకు గుర్రపుడెక్క, తూటుకాడ పెరిగిపోయి ఆటంకం ఏర్పరుస్తోంది. పెరిగిన గుర్రపుడెక్క తొలగించకపోతే పైనుంచి వచ్చే కొద్దిపాటి నీరుకూడా రాదని రైతులు అంటున్నారు. రబీ సీజన్ ప్రారంభానికి ముందే డ్రెయిన్లలో రసాయనిక మందులు పిచికారీ చేయించి, గుర్రపుడెక్కను ఉపాధిహామీ పథకం ద్వారా తొలగించేందుకు చర్యలు తీసుకుని ఉంటే తోడుకునే వారమని, ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయిందని రైతులు అంటున్నారు. అధికారులు, నాయకులు స్పందించి పంట, మురుగు కాలువలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గుర్రపుడెక్క తొలగించాలి



శహపురం, వెంకటప్పయ్య, జెడ్.భావారం తదితర డ్రెయిన్లలో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగిపోయింది. దీనివల్ల పైనుంచి వచ్చేనీరు రావడం. అధికారులు స్పందించి గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.
– నక్కా వీరభద్రరావు, రైతు, కరప

తూటుకాడ పెరిగింది



డ్రెయిన్లు, పంట బోదెల్లో తూటుకాడ, గుర్రపుడెక్క అడవిలా పెరిగిపోయింది. దీనివల్ల నీటి ప్రవాహవేగం తగ్గిపోయి, సాగునీరు పూర్తి స్థాయిలో అందడం లేదు. తుల్యభాగ డ్రెయిన్, యండమూరు మురుగు కాలువ అధ్వానంగా తయారై, తోడుకోవడానికి కూడా నీరందడం లేదు. పంట, మురుగు కాలువల్లో పెరిగిన తూటుకాడను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.
– మార్నెళ్ల వెంకటరమణ, కౌలురైతు, యండమూరు

అధికారి ఏమన్నారంటే..

పంట కాలువల్లో గుర్రపుడెక్క పెరిగిపోయి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇరిగేషన్ శాఖ కొవ్వూరు సెక్షన్ ఏఈఈ నాగిరెడ్డి నాగభవానీని 'సాక్షి' వివరణ కోరగా, పంట కాలువల్లో చాలావరకూ గుర్రపుడెక్క తొలగించామన్నారు. కేఎంజే కెనాల్‌లో కూడా గుర్రపుడెక్క తొలగింపు పనులు జరుగుతున్నాయని అన్నారు.

ఘనంగా బల్లల పండగ



కరపలో కులదేవత ఈదమ్మతల్లికి పూజలు చేస్తున్న రజకులు

కరప: స్థానికంగా ఆదివారం రజకులు బల్లల పండగను ఘనంగా జరుపుకొన్నారు. శివగంగ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో కొత్తపేట, పల్లపువీధి, రామకంచిరాజునగర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని రజకులు తీన్‌మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో తమ కులదేవత ఈదమ్మతల్లిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్థానిక సిపాయి చెరువు చాకిరేవులోని బల్లల వద్ద రజకుల కులదేవత ఈదమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. శివగంగ రజక సేవా సంఘం నాయకులు సైన వరపు పెదసత్యనారాయణ, మురమల్ల నాగేశ్వరరావు, సైనవరపు సతీష్, మంచాల శ్రీనివాస్, సైనవరపు భవానీశంకర్, ఎం.శ్రీనివాసరావు, ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో రజకులు వినియోగించే చెరువును సామూహిక మంచినీటి పథకానికి తీసుకున్నారని, దానికి బదులుగా సిపాయి చెరువు ఇస్తామన్న హామీని నిలపెట్టుకుని, దోబీఖానా నిర్మించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఆశాజ్యోతికి శివగంగా రజక సేవా సంఘ ప్రతినిధులు కోరారు.

పేకాటాడుతున్న పది మంది అరెస్ట్

కాకినాడ రూరల్: ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధి చీడిగ గ్రామంలో పేకాట శిబిరంపై ఎస్సై వీరబాబు, తన సిబ్బందితో దాడి చేశారు. పది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రు.1,26,290 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

భజే భావనారాయణ



సర్పవరంలో భావనారాయణ స్వామి

- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ముగిసిన మాఘ తిరునాళ్లు



సర్పవరం ఆలయం వద్ద దర్శనాలకు క్యూలో ఉన్న భక్తులు



మాట్లాడుతున్న ఆదిగురు యోగా పీఠం వ్యవస్థాపకులు సద్గురు సచ్చిదానంద యోగి

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మాఘ మాసం సందర్భంగా ప్రతి ఆదివారం తిరునాళ్ల జరగడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. చివరి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు ముక్తికా సరస్సులో స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో పొంగలి తయారు చేసుకుని సూర్యభగవాడికి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు, దాతల సహకారంతో వేలాదిగా వచ్చిన భక్తులకు ఉచిత అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

26న సామూహిక రుద్రాభిషేకం

బోట్‌క్లబ్: మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న స్థానిక రామారావుపేటలో ఆదిగురు యోగా పీఠంలో సామూహిక మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు సద్గురు సచ్చిదానంద యోగి తెలిపారు. పీఠంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మన సంస్కృతీ సంప్రదాయాలు ప్రస్తుత తరానికి తెలిసే విధంగా సామూహిక మహా రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తామని చెప్పారు. శిష్యులు ఎం.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పీఠంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని రాత్రి 7.30 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు లింగోద్భవ సమయం వరకూ రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేస్తామని వివరించారు.

ఐక్యంగా ముందుకు సాగుదాం..



పంచాయతీ రాజ్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో సభ్యులకు సన్మానం

కాకినాడ రూరల్: సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగుదామని ఏపీ పంచాయతీ రాజ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పూర్వపు తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ఎండీ సంథాని అన్నారు. రమణయ్యపేట సర్పవరం జంక్షన్ వద్ద మండల పరిషత్ కార్యాలయంలో సంఘ సర్వసభ్య సమావేశం జనరల్ సెక్రటరీ వీఎస్‌జేవీ రమణరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో చేసిన తీర్మానాలు అమలుపై చర్చించారు. అసోసియేషన్ అభివృద్ధి కోసం సభ్యుల అభిప్రాయాలు సేకరించారు. పంచాయతీరాజ్ ఎంపీడీఓ నుంచి మొదలుకొని వివిధ హోదాలలో పనిచేసిన అధికారులు సభ్యులుగా ఉండడంతో వారంతా మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం ప్రశాంతంగా సాగిస్తున్న శేష జీవితంలో ఆప్యాయతతో కష్ట సుఖాలు తెలియజేసుకునేందుకు అసోసియేషన్ దోహదపడుతుందన్నారు. సంఘం కోసం విశిష్ట సేవలందించిన సభ్యులను సన్మానించారు. అలాగే సంఘంలోని వైవీ జగన్నాథరావుకు టెక్సాస్‌లోని యూనివర్సిటీ సేవారత్న బిరుదు ఇవ్వడంతో ఆయనను, బీహెచ్ఎస్ మూర్తిలను సన్మానించారు. జనచైతన్య కాలనీ ముగ్గుల పోటీల విజేతకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కోశాధికారి పట్టాభి రామయ్య, రాధాకృష్ణ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి అందించండి



వేములవాడలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

కరప: గృహాల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా పారిశుధ్య కార్మికులు ఇంటికి వచ్చినప్పుడు అందజేసి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. ఇంటింటా చెత్త సేకరణ–ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రెండోరోజు ఆదివారం ఆయన పంచాయతీ సిబ్బందితో కలసి కరప, వలసపాకల, వేములవాడ తదితర గ్రామాల్లో పర్యటించారు. ప్రజలను కలసి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. అందుకు ఎవరికివారు తడి, పొడి చెత్తను వేరుచేసి, పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వాడకాన్ని తగ్గించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పి.వీరభద్రరావు, బి.చంద్రకళ, వై.రాంజీ, యు.నిర్మలాదేవి, పి.ఉమామహేశ్వరి, సుధాకర్, సునీల్, కిరణ్, జి.దుర్గాభవానీ, పీఎస్ఆర్ బ్రహ్మానందం తదితరులు ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

వ్యాయామంతో ఎముకల గట్టిదనం



ఎముకల పటుత్వంపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు చల్లా భావతేజ

కాకినాడ రూరల్: వ్యాయామంతో ఎముకలు గట్టిపడతాయని వైద్యుడు చల్లా భావతేజ అన్నారు. స్థానిక బోట్‌క్లబ్ ఉద్యానవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి శారీరక శ్రమ అవసరమన్నారు. 20 ఏళ్ల తరువాత ఎముకల సాంద్రత పెరిగి 35 ఏళ్లనాటికి తగ్గుతూ ఉంటుందన్నారు. ఎముకలు బలహీన పడితే చిన్నపాటి ప్రమాదాలకు అవి విరిగే అవకాశం ఉందన్నారు. దీర్ఘకాలిక మందులు వినియోగం ఎముకలపై పడుతుందన్నారు. ఎముకల బలానికి తగినంత ఖనిజాలు, ప్రొటీన్లు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. బోట్ క్లబ్ వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, పీవీ రాఘవరావు, ప్రసాద్ నాయుడు, రమణ, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో నీరొచ్చింది..



కరపలో రక్షిత మంచినీటి చెరువుకు ఒకపక్క వాకింగ్ ట్రాక్‌పై నిలిచిపోయిన నీరు

కరప: సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వాకింగ్ ట్రాక్‌పై నీరు చేరడంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరపలోని సామూహిక రక్షిత మంచినీటి చెరువు ద్వారా 8 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ చెరువుకు పెనుగుదురులోని కేఎంజే కెనాల్ నుంచి పైపులైన్ ద్వారా మంచినీటి చెరువును నింపుతారు. ఈ నీటిని క్లోరినేషన్ చేసి, గ్రామాలకు రక్షిత మంచినీటిని అందిస్తారు. రెండేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామస్తుల వినతి మేరకు రక్షిత మంచినీటి చెరువు చుట్టూ రూ.కోటితో వాకింగ్ ట్రాక్ నిర్మించారు. గ్రామస్తులు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తుంటారు. ఆదివారం ఉదయం రక్షిత మంచినీటి చెరువును నింపేందుకు వేసిన మోటార్లను, చెరువు నిండిన తర్వాత మోటార్లను ఆపాల్సి ఉంటుంది. అయితే సిబ్బంది పట్టించుకోకపోవడంతో చెరువులోని నీరు వాకింగ్ ట్రాక్‌పై చేరింది. ఐదారుచోట్ల ట్రాక్‌పై నీరు నిలబడిపోయింది. తాగునీరు వృథా కావడమే కాకుండా, నడవడానికి వీల్లేక వాకర్స్ ఇబ్బందులకు గురయ్యారు. తరచూ ఇలాగే వదిలేస్తుంటారని, అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరారు.

స్వచ్ఛభారత్‌కు ఆద్యుడు గాడ్గేబాబా

కాకినాడ రూరల్: గాడ్గేబాబా మహారాష్ట్రలో జన్మించి జీవితాంతం చీపురుతో వీధులను శుభ్రం చేస్తూ స్వచ్ఛ భారత్‌కు నాంది పలికారని న్యాయవాది యనమల రామం అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గాడ్గే బాబా జయంతిని నిర్వహించారు. గాడ్గే బాబా చిత్రపటానికి రామం, అడబాల రత్నప్రసాద్, కుమార్ యాదవ్ తదితరులు పూలమాలలు వేశారు. రామం మాట్లాడుతూ గాడ్గే బాబా 1876 ఫిబ్రవరి 23న జన్మించారన్నారు. ఫాదర్ ఆఫ్ ద క్లీన్‌నెస్‌గా పేరొందిన బాబా సంఘ సంస్కర్తగా, పర్యావరణ వాదిగా పేరొందారన్నారు.

కార్పొరేషన్ ఖజానా గుల్ల



శ్రీవిద్యాకాలనీలో సింథటిక్ టెన్నిస్ కోర్టులో టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

బోట్‌క్లబ్: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమ కరెంట్ సరఫరాతో రూ.లక్షల్లో భారంగా మారుతున్న బిల్లులపై దర్యాప్తు చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శ్రీవిద్యా కాలనీలో పదేళ్ల కిందట నగర పాలక సంస్థ నిధులు రూ. 50 లక్షలు వెచ్చించి నిర్మించిన రెండు సింథటిక్ టెన్నిస్ కోర్టులను టెండర్ల నిర్వహణ ద్వారా అజమాయిషీ చేయకుండా పరపతి కలిగిన వ్యక్తుల చేతుల్లోకి వదిలి వేశారన్నారు. దీంతో కార్పొరేషన్ ఖజానాకు తీవ్ర నష్టం వస్తుందన్నారు. ఇష్టారాజ్యంగా కోర్టు ప్రాంగణాలు గదులను సొంతానికి వాడుకుంటున్న ధోరణి, కరెంటు చార్జీలు చెల్లించాల్సిన పద్ధతిలో ఉచితంగా అప్పగించినప్పటికీ భారీ విద్యుత్ చార్జీలు నగరపాలక సంస్థ భరించడం విడ్డూరంగా ఉందన్నారు. క్రీడాకారులు దుస్తులు మార్చుకునే గదిని నివాస గృహం చేయడంతో సౌకర్యాలు కరవయ్యాయన్నారు. మూడేళ్ల క్రితం టెండర్ల నిర్వహణకు పిలుపు ఇచ్చినా కార్యరూపం దాల్చలేదన్నారు. అనధికారికంగా క్యాంటీన్ నిర్వహణ వీటన్నిటికీ యథేచ్ఛగా కార్పొరేషన్ స్ట్రీట్ లైట్ కరెంట్‌ను ఫ్రీగా దుబారాగా వినియోగించడంతో కార్పొరేషన్‌కు భారమవుతుందన్నారు. శ్రీవిద్యా కాలనీ స్కేటింగ్ కోర్టులకు కుళాయి చెరువు ఆవరణలోని వైఎస్ఆర్ స్కేటింగ్ సెంటర్ తరహాలో టెండర్లు పిలిస్తే వచ్చే నష్టం ఏంటని అధికారులను సూటిగా ప్రశ్నించారు. దీనిపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, కమిషనర్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

కళల వైపు ప్రోత్సహించేందుకే పోటీలు



భిన్నత్వంలో ఏకత్వం నాటికలో ఓ సన్నివేశం



నృత్యం చేస్తున్న చిన్నారులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): చిన్నారులను కళలు, రంగస్థలం వైపు ప్రోత్సహించేందుకే నాటిక ప్రదర్శనలు, వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నామని యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు తెలిపారు. ది కాకినాడ చిల్డ్రన్స్ థియేటర్, దంటు సూర్యారావు స్మారక నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రంలో చిన్నారుల నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనల పోటీలు నిర్వహించారు. నేటితరం చిన్నారులు కేవలం చదువు వైపు మాత్రమే పరుగులు తీస్తున్నారన్నారు. దీంతో వారికి సంప్రదాయాలు, అనుబంధాలు తెలియడం లేదన్నారు. చిన్నారులకు అనుబంధాలు, ఆప్యాయతలు, తల్లిదండ్రులు, గురువులు పట్ల గౌరవం తెలియజేయాలంటే నాటికలు మంచి వేదికలన్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా దిబ్లూక్రెస్ట్ పాఠశాల కాకినాడ వారిచే తెనాలి రామకృష్ణ నాటిక, ఉషోదయ మెరిట్ స్కూల్ ఇంద్రపాలెం వారిచే అనుసరణ నాటిక, శారదా విద్యాలయం తిమ్మాపురం వారిచే సోషల్ మీడియా నాటిక, ఎంపీయూపీ పాఠశాల అచ్చంగి వారిచే భిన్నత్వంలో ఏకత్వం నాటిక, ఉప్పాడ– కొత్తపల్లి హైస్కూల్ వారిచే ఆడపిల్లలను పుట్టనిద్దాం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తామరాడ వారిచే మాతృదేవోభవ నాటిక, శ్రీఆదర్శ హైస్కూల్ పిఠాపురం వారి ఏరువాక నాటిక, జెడ్పీ ఉన్నత పాఠశాల కోటనందూరు వారిచే నేరం ఎవరిది నాటికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలకు యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ సహాయ కార్యదర్శి నాదెళ్ల ప్రభుదాసు, ఎంవీ రమణ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు.